



# వార్త మిర్రర్
తెలుగు దినపత్రిక

PUBLISHED: RANGAREDDY | సంపుటి: 10 సంచిక: 18 | శుక్రవారం, 30 జనవరి, 2026 | ఎడిటర్ : బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు: 5 | వెల: 3/-

## ఆ విమానం అతను నడపాల్సింది కాదు

- ట్రాఫిక్‌లో చిక్కుకున్న మరో పైలట్
- చివరి నిమిషంలో విధుల్లోకి చేరిన కెప్టెన్ సుమిత్ కపూర్
- చేతికి ఉన్న బ్రాస్‌లెట్ ఆధారంగా సుమిత్ కపూర్‌ను గుర్తించిన స్నేహితులు
- ప్రాథమిక విచారణలో పైలట్ అంచనా తప్పిందని భావన
- అనుభవం ఉన్న సుమిత్ తప్పు చేసే అవకాశం లేదంటున్న ఆత్మీయులు

మహారాష్ట్ర రాజకీయ సంచలనం అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయిన విమాన ప్రమాదంలో పైలట్ కెప్టెన్ సుమిత్ కపూర్ మృతి వెనుక విషాదకరమైన కోణం వెలుగులోకి వచ్చింది. నిజానికి ఆ విమానాన్ని సుమిత్ నడపాల్సింది కాదని, కేవలం ఒక యాదృచ్ఛిక ఘటన అతడిని మృత్యువు ఒడికి చేర్చిందని ఆయన స్నేహితులు వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన సుమిత్ కపూర్ అంత్యక్రియల సందర్భంగా ఆయన మిత్రులు పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

# తెలంగాణ ఆర్థిక ప్రగతికి కేంద్రం కితాబు

- తగ్గుతున్న ద్రవ్యోల్బణం.. పెరుగుతున్న జీడీపీ!
- సొంత పన్ను వనరుల ద్వారా ఆదాయాన్ని గడించడంలో తెలంగాణ అగ్రపథం
- 2022లో 8.6 శాతంగా ఉన్న ధరల పెరుగుదల రేటు ప్రస్తుతం 0.20 శాతానికి పతనం
- 2035 నాటికి 201 బిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా హైదరాబాద్ ఎదిగే అవకాశం



దేశ ఆర్థిక ముఖచిత్రంలో తెలంగాణ తనదైన ముద్ర వేస్తోందని కేంద్ర ఆర్థిక సర్వే 2025-26 ప్రశంసించింది. రాష్ట్రం తన సొంత వనరుల నుంచే అత్యధిక ఆదాయాన్ని సమకూర్చుకుంటూ 12.6 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేయడం విశేషమని పేర్కొంది. ముఖ్యంగా సామాన్యుడిని వేధించే ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో తెలంగాణ సాధించిన ప్రగతిని సర్వే ప్రత్యేకంగా ప్రస్తావించింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు

- రేపు విచారణకు రాలేనంటూ సిట్‌కు కేసీఆర్ రిప్లయ్
- నోటీసుల నేపథ్యంలో సిట్‌కు ప్రత్యుత్తరం రాసిన కేసీఆర్
- రేపు మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు చివరి రోజు అన్న కేసీఆర్
- ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తానని వెల్లడి

2లో

## హైదరాబాద్‌లో హైడ్రా కొరడా

- జూబ్లీహిల్స్ 'నీరూస్'కు తాళాలు
- అగ్నిమాపక నిబంధనలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా
- జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ నీరూస్ షోరూంను సీజ్ చేసిన అధికారులు
- నాంపల్లిలో మరో ఫర్నిచర్ షోరూంకు కూడా తాళం
- నాంపల్లి దుర్ఘటన తర్వాత తనిఖీలు ముమ్మరం
- ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలని ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి



2లో

## తిరుమల లడ్డూను రసాయనాలతో తయారు చేశారు

- సత్యకుమార్
- లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారని సిట్ నివేదిక ఇచ్చిందన్న సత్యకుమార్
- అవినీతిపరులను జైలుకి పంపితే రెడ్ బుక్ అంటున్నారని మండిపాటు
- జగన్ ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు



2లో



2లో

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడికి విజయసాయిరెడ్డి విజ్ఞప్తి

- దేశీయ విమానయానం ఏటా 10-12 శాతం వృద్ధి చెందుతోందని వెల్లడి
- ఇటీవలి ఘటనలతో ప్రయాణికుల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని ఆందోళన
- డీజీసీఏ ఆధునికీకరణ, ఏటీసీ సిబ్బందిని పెంచాలని సూచన

## గుంటూరు, కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన



2లో

ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో పర్యటనకు సిద్ధమయ్యారు. గుంటూరు, కుప్పం నియోజకవర్గాల్లో పర్యటించి పలు కీలక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. శుక్రవారం గుంటూరులో పర్యటించిన అనంతరం, మూడు రోజుల పాటు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించనున్నారు.

- గుంటూరులో మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించనున్న సీఎం
- మూడు రోజులపాటు కుప్పంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- కుప్పంలో రూ.675 కోట్ల పెట్టుబడులతో ఏడు పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు
- 12,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ఎంఓయూలపై సంతకాలు

## అజిత్ పవార్ అంత్యక్రియల్లో నారా లోకేశ్



- బారామతిలో అజిత్ పవార్ అంత్యక్రియలు
- నివాళి అర్పించిన నారా లోకేశ్
- అంత్యక్రియలకు హాజరైన అనగాని, కృష్ణదేవరాయలు, మాగుంట


మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భౌతికకాయాన్ని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ సందర్శించి నివాళులు అర్పించారు. బారామతిలో నిర్వహించిన అజిత్ పవార్ అంత్యక్రియల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. దివంగత అజిత్ పవార్ కు నివాళులర్పించిన వారిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీనేత లావు కృష్ణదేవరాయలు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఉన్నారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భౌతికకాయాన్ని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ సందర్శించి నివాళులు అర్పించారు. బారామతిలో నిర్వహించిన అజిత్ పవార్ అంత్యక్రియల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. దివంగత అజిత్ పవార్ కు నివాళులర్పించిన వారిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీనేత లావు కృష్ణదేవరాయలు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

# ఎమ్మెల్యే అరవ శ్రీధర్ లైంగిక ఆరోపణల వ్యవహారం

జనసేన పార్టీకి చెందిన రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ వ్యవహారంపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించిన జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. ఇందులో వాస్తవాలను వెలికితీసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన త్రిసభ్య కమిటీని రంగంలోకి దించారు. జనసేన అధిష్టానం నియమించిన ఈ త్రిసభ్య కమిటీ రైల్వే కోడూరులో పర్యటించి ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టనుంది. ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై ఆరోపణలు చేస్తూ వీడియోలు విడుదల చేసిన బాధిత మహిళ నుంచి.. ఈ త్రిసభ్య కమిటీ వివరాలు సేకరించనుంది. అంతేకాకుండా ఈ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వెంటనే కమిటీ ముందుకు వచ్చి తన వివరణ ఇవ్వాలని పార్టీ శాసనసభా పక్షం స్పష్టం చేసింది. సాక్ష్యాధారాలు, సంబంధిత అధికారుల వివరాలను సేకరించిన తర్వాత.. ఈ త్రిసభ్య కమిటీ పవన్ కళ్యాణ్‌కు తుది నివేదికను అందజేయనుంది. తాజాగా జరిగిన జనసేన ఎమ్మెల్యేల సమావేశంలో ఈ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. ఆరోపణలు వచ్చిన వెంటనే కమిటీని వేయడం ద్వారా మహిళా భద్రత విషయంలో పార్టీ నిబద్ధతను పవన్ కళ్యాణ్ చాటుకున్నారని జనసేన ఎమ్మెల్యేలు అభిప్రాయం వ్యక్తం చేశారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారాలు చేయిస్తోందని కొందరు సభ్యులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే.. నిజానిజాలు తేలే వరకు ఎవరినీ ఉపేక్షించేది లేదని పార్టీ వర్గాలు తెలిపాయి. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ఎమ్మెల్యేపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఒకవేళ ఆరోపణలు నిజమని తేలితే పార్టీ నుంచి సస్పెండ్ చేసే వరకు వెళ్లవచ్చని తెలుస్తోంది. మహిళల న్యాయం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని జనసేన నేతలు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు.. ఈ వ్యవహారం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనలో ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్న మహిళకు సంబంధించిన పలు వీడియోలు బయటికి రావడం సంచలనం రేపుతోంది.

# ఏఐతో ఉద్యోగాలకుపెను ముప్పు!

న్యూఢిల్లీ, జనవరి 29: మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని పరితపిస్తున్న భారత్ ఒకవైపు అవకాశాలు, మరోవైపు ముప్పులు పొంచివున్న నాలుగు రోడ్ల కూడలిలో నిలబడిందని జాతీయ ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. ముఖ్యంగా ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ విప్లవాన్ని అందిపుచ్చుకుంటే అమెరికా తర్వాత అత్యధిక ఏఐ లిటరేట్స్ ఉన్న భారతదేశం జీడీపీ పరంగా ఎక్కడికో వెళ్లిపోతుందని అంచనా వేస్తోంది. అయితే, బడాబడా కంపెనీలన్నీ ఏఐ రంగంలో లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు కుమ్మరించిన నేపథ్యంలో ఏమైనా తేడా వస్తే మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థే 2008 తరహా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా జరిగే అవకాశం 10 నుంచి 20 శాతం వరకు ఉందని, దాన్ని విస్మరించలేమని చెప్పింది. అదే జరిగితే మనుగడ పోరాటంలో భాగంగా మహామహా ఐటీ కంపెనీలు పెట్టే బడ్జెట్ కోతల్లో ప్రధానంగా సమిధలయ్యేది భారతీయవైట్ కాలర్ ఉద్యోగులేనని హెచ్చరించింది. ఏఐ అమల్లోకి వచ్చిన 2022 నుంచే రొటీన్ ఉద్యోగాల కోతలు మొదలయ్యాయని, ఆర్థిక సంక్షోభం ఖాయమైతే తీవ్రత ఊహించలేని విధంగా ఉంటుందని అప్రమత్తం చేసింది. కేంద్రం ఏఐ ఆర్థిక మండలిని ఏర్పాటు చేసి, ఉద్యోగాలను కాపాడుకొనే మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లోనూ భారత్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతం వృద్ధిరేటు సాధిస్తుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ప్రభుత్వం దగ్గర దాదాపు రూ.65 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉన్నాయని, అందులో ఈ ఏడాది ప్రవాసులు పంపిన డబ్బులే రూ.12 లక్షల కోట్లు ఉంటాయని తెలిపింది. దేశంలో ఊబకాయం అతిపెద్ద ఆరోగ్య సమస్యగా అవతరించిందని ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. అత్యంత ప్రాసెస్ చేసిన ఆహారం, కదలకుండా కూర్చోవడం కలగలిసి చిన్న పెద్దా పల్లె పట్నం తేడా లేకుండా అందర్నీ మధుమేహం, గుండె జబ్బులు, రక్తపోటు బారిన పడేట్లు చేస్తున్నాయని గణాంకాలతో ప్రస్తావించింది. అత్యంత ప్రాసెస్ చేసిన ఆహారం పదిహేనేళ్లలో 40 రెట్లు పెరిగిందని, ఊబకాయం రెండింతలు




అయిందని వెల్లడించింది. పిల్లలు మెలకువగా ఉన్న సమయంలో టీవీల్లో ఫుడ్ యాడ్‌లు రాకుండా చూడాలని, నూనె, ఉప్పు, చక్కెర ఎక్కువగా వాడే ఆహారంపై సిగరెట్ల లాగా చట్టబద్ధమైన హెచ్చరికలు పెట్టాలని సలహా ఇచ్చింది.

డిజిటల్ అడిక్షన్ జాతీయ ఆరోగ్య సమస్యగా పరిణమించిందని, ఎక్కువ సేపు స్క్రీన్ చూడటం, సోషల్ మీడియా స్క్రోల్ చేయడం వల్ల యువత సామాజిక బంధాలను పూర్తిగా కోల్పోవడమే కాకుండా తెలివితేటలు కూడా దెబ్బతింటున్నాయని తెలిపింది. జీడీపీలో 12న్న డిజిటల్ ఎకానమీ నుంచే వస్తున్న నేపథ్యంలో రెండింటినీ సమన్వయం చేయాలని సూచించింది. విద్యార్థులు ఏఐని విచ్చలవిడిగా వాడటం వల్ల ఆందోళన, కుంగుబాటు పెరిగి సమస్యను పరిష్కరించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది.

యూత్ హబ్‌లు ఏర్పాటు చేసి యువత కలుసుకొనే వేదికలు కల్పించాలని చెప్పింది. 1.2 కోట్ల గిగ్ వర్కర్లలో 40 శాతం మందికి నెలకు రూ.15 వేలు కూడా రావడం లేదని సర్వే ప్రస్తావించింది. గంటకు లేదా టాస్క్‌ను బట్టి ఇంత కనీస వేతనం ఉండేట్లు నిబంధనలు పెట్టాలని సూచించింది.

# భూభారం... రూ.40 కోట్లు!

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 29: వచ్చే నెల 1 నుంచి పెరగనున్న భూ మార్కెట్ విలువలతో ప్రజలపై రూ.40 కోట్ల మేర రిజిస్ట్రేషన్ల భారం పడనుంది. పెరిగే మార్కెట్ ధరలపై సేల్ డీడ్‌కు రిజిస్ట్రేషన్ చార్జీలు 7.5 శాతం చెల్లించాల్సి ఉంటుంది. అన్నిచోట్ల చదరపు గజం రూపంలో, వ్యవసాయ భూములు ఎకరాల రూపంలో సబ్‌రిజిస్ట్రార్లు విలువల పెంపు నివేదికను సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 2019న ఒకసారి, కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో 2022 ఏప్రిల్‌లో కొంతమేర భూ మార్కెట్ విలువలు పెంచింది. 2023లో అక్కడక్కడా భూముల ధరలు సవరించిన ప్రభుత్వం 2025 ఫిబ్రవరిలో జిల్లావ్యాప్తంగా గ్రామీణ, అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో భూమార్కెట్ విలువలను సవరించింది. ఇప్పుడు ఫిబ్రవరి 1 నుంచి మరోసారి భూ విలువను పెంచనుంది. దీనిపై అభ్యంతరాల స్వీకరణ గడువు గురువారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. 5-10 శాతం మేర భూవిలువలు పెంచుతూ తయారుచేసిన ప్రతిపాదిత నివేదికపై నగరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి మూడు అభ్యంతరాలు అందగా, ఇంకెక్కడా అభ్యంతరాలు రాలేదు. ఈ అభ్యంతరాలను నగరి ఎస్ఆర్ 24 గంటల్లో పరిష్కరిస్తారు. భూభారం పెంపు గడువుకు శుక్ర, శనివారాలు మాత్రమే ఉన్నాయి. ఫిబ్రవరి ఒకటి తర్వాత భూ విలువ పెంపు ప్రభావం రిజిస్ట్రేషన్ల ఖర్చుపై పడనుంది. అందుకని ఈలోపే రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి కక్షిదారులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో బుధవారం రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.1.75 కోట్లు.. గురువారం సాయంత్రం 5 గంటల వరకు అందిన సమాచారం మేర రూ.60 లక్షలు ప్రభుత్వ ఖజానాకు అందింది. శుక్ర, శనివారాల్లో రద్దీ పెరగవచ్చన్న ఆలోచనతో ఆ రెండురోజులు స్లాట్ బుకింగ్ చేసుకున్నా, చేసుకోకపోయినా... అందరి డాక్యుమెంట్లు అర్ధరాత్రి వరకైనా రిజిస్ట్రేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సబ్‌రిజిస్ట్రార్లకు అధికారులు ఆదేశాలిచ్చారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. కాగా, భూ విలువపెంపుతో పెరగనున్న పెరిజిస్ట్రేషన్ చార్జీలు రియల్ ఎస్టేట్‌పై ప్రభావం చూపనుంది.

# ఈ గోప్యత ఏ గుట్టు దాచడానికి?

*తెలుగు చలనచిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ వివాదం మరొకసారి తెరమీదకు వచ్చింది. దీనిపై భిన్నాభిప్రాయాలు, విభిన్న వాదనలు సామాజిక మాధ్యమాల వేదికగా వెలువడుతున్నాయి. తెలుగు సినిమా రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక దాడి లాంటి సమస్యలపై అధ్యయనం చేసిన 'తెలంగాణ మహిళా ట్రాన్స్‌జెండర్ జాయింట్ యాక్షన్ కమిటీ' ప్రతినిధుల్లో ఒకరైన అచ్యుత సునీత ఈ సందర్భంగా పలు విషయాలు 'నవ్య'తో పంచుకున్నారు. '2022లో మహిళా సంఘాలు ప్రాతినిధ్యం వహించి, ఇచ్చిన సబ్ కమిటీ నివేదికను బహిర్గతం చేయకపోవడానికి కారణం ఏమిటి?' అని ఆ కమిటీలో భాగమైన తెలుగు సినిమా పెద్దలను, తెలంగాణ ప్రభుత్వాన్ని ఆమె నిలదీస్తున్నారు.*



"తెలుగు చలనచిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ అత్యంత బలంగా వేళ్లూనుకొని ఉంది. అది అన్ని విభాగాల్లోనూ సర్వసాధారణంగా కొనసాగుతోంది. ఆ హింసను భరించలేక ఎవరైనా ఒకరిద్దరు ధైర్యం చేసి ఫిర్యాదు ఇస్తే... వాళ్లకు ఇక ఆ పరిశ్రమలో పని దొరకకుండా చేస్తున్న దుర్మార్గ పరిస్థితులు చూస్తున్నాం. దానికితోడు బాధితురాలి మీదే బండలు వేస్తున్న ఉదంతాలు మరెన్నో. కేవలం తెలుగు సినిమా రంగానికే పరిమితమైన సమస్య కాదు ఇది. హాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్, శాండల్‌వుడ్... ఇలా ప్రతిచోటా మహిళలు ఎదుర్కొంటున్న శ్రమ దోపిడి, వివక్ష, లైంగిక హింసపై పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తున్నాయి. తెలుగు సినీ పరిశ్రమ అంతా ఒకే కుటుంబమనీ, ఇక్కడ అలాంటి వేధింపులకు ఆస్కారమే లేదనీ అనుకోవడం పరిశ్రమలోనూ మహిళల అభ్యున్నతికి అవరోధాలు ఉన్నాయనే వాస్తవాన్ని మొదట సినిమా పెద్దలు అంగీకరించాలి. 'మహిళల శరీరాలు తమకు లోబడి ఉండాలి. ఎవరైనా దాన్ని ధిక్కరిస్తే, వారి మీద రకరకాల నిందలు మోపి, ఆత్మన్యూనతలోకి నెట్టేయాలి. అంతిమంగా భవిష్యత్తు లేకుండా చేయాలి' లాంటి మగస్వామ్య భావాలు బలంగా నాటుకొని ఉన్న సినీ రంగంలో మార్పు మొదలు కావాలంటే సమస్యలను గుర్తించకుండామాత్రం సాధ్యం కాదు. ఒకరిద్దరు బాధితురాళ్లు సినిమా పరిశ్రమలోని అమానుషాలను బహిర్గతం చేసిన సమయంలో... తెలంగాణ మహిళా ట్రాన్స్‌జెండర్ ఉమ్మడి కార్యాచరణ వేదిక (జాక్) వారికి అండగా నిలిచింది. ఈ సమస్యపై క్షేత్రస్థాయి అధ్యయనం ప్రారంభించింది. విచారణ ద్వారా జూనియర్, డైలాగ్ ఆర్టిస్టులతో సుదీర్ఘంగా చర్చించింది. ఆ క్రమంలోనే 'జాక్'లో భాగమైన మేమంతా సమస్య తీవ్రతను అర్థం చేసుకున్నాం. దీనిపై న్యాయస్థానాన్ని, జాతీయ మానవహక్కుల వేదిక, మహిళా కమిషన్లను సైతం ఆశ్రయించాం. 'మహిళా, ట్రాన్స్‌జెండర్ జాక్' ఒత్తిడితోనే నిర్మాతలు, దర్శకులు, స్టూడియో అధినేతలతో పాటు సామాజికవేత్తలు మొత్తం 44 మందితో హైపవర్ కమిటీని 2019లో తెలంగాణ ప్రభుత్వం నియమించింది. అందులోని పెద్దలు ఎక్కువ సమయం కేటాయించకపోవడంతో... నాతో పాటు భూమిక సత్యవతి, అంకురం సుమిత్ర, బి.గిరిజ, న్యాయవాది వసుధా నాగరాజ్, సినీ, టెలివిజన్ రంగాల నుంచి ఝాన్సీ, ప్రీతినిగంతో పాటు పోలీసు, మహిళా, కార్మిక తదితర ప్రభుత్వ శాఖల బాధ్యులతో కలిపి సబ్ కమిటీ అదే ఏడాది ఏర్పాటయింది. మేమంతా 16 క్రాఫ్ట్‌లకు చెందిన వివిధ యూనియన్ల బాధ్యులు, జూనియర్, డైలాగ్ ఆర్టిస్టులు, నిర్మాతలు, ఇతర శ్రామికులతో నిరంతర సమావేశాలు నిర్వహించాం. ఒక్క యూనియన్‌లోనూ అంతర్గత ఫిర్యాదుల కమిటీ లేదని మాకు అప్పుడు తెలిసింది. 'కమిట్‌మెంట్' అనే పేరుతో కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు క్యాస్టింగ్ కౌచ్ ఎంత బలంగా వ్యవస్థీకృతమైందో మాకు అర్థమైంది. నటీనటుల కో-ఆర్డినేటర్ వ్యవస్థ ప్రవేశం తర్వాత అది ఎంతగా వికృత రూపం దాల్చిందో కూడా కొంతమంది బాధితులు మాకు ఉదాహరణలతో సహా వివరించారు. ఆడిషన్‌కు పిలిచి అత్యాచారం చేసిన ఘటనలున్నాయి. బూతుల సంస్కృతి, అవమానకరంగా మాట్లాడడం లాంటివాటి గురించి ఇక చెప్పనక్కర్లేదు. ఇలా మహిళలపై సినిమా పరిశ్రమలో కొనసాగుతోన్న దోపిడీ తాలుకూ రూపాలు ఒకటా, రెండా... బహిర్గతం చేయలేని విస్తుగొల్పే విషయాలెన్నో మా దృష్టికి వచ్చాయి. కుటుంబాన్ని ధిక్కరించి మరీ ప్రతిభావంతులైన అమ్మాయిలు అభిరుచితో ఇక్కడకు వచ్చినా... అవమానాలు, హింస భరించలేక వెనక్కి వెళ్లిపోతున్నారు. సినిమా, టెలివిజన్ రంగంలోని ప్రతి స్టూడియో, యూనియన్, ప్రొడక్షన్ యూనిట్‌లతో సహా అన్ని విభాగాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆ నివేదికలో స్పష్టం చేశాం. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టానికి సినిమా, టెలివిజన్, మీడియా పరిశ్రమ అతీతమా? చలనచిత్ర రంగంలోని మహిళల సమస్యలపై చర్చించడానికి సినిమా పెద్దలకే ఆసక్తి లేదని మాకు అర్థమవుతుంది. లేకపోతే, నాలుగేళ్ల కిందట తెలంగాణ మహిళా ట్రాన్స్‌జెండర్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు ఇచ్చిన నివేదికను ఇంతవరకు బహిర్గతం చేయపోవడం వెనుక మతలబు ఏంటి? ఇంతవరకు దానిపై కనీసం వారైనా అంతర్గతంగా చర్చించకపోవడం శోచనీయం. మేము ఆ నివేదికను జనబాహుళ్యంలో పెట్టకపోవడానికి ప్రధాన కారణం... గోప్యతకు భంగం కలిగించారన్న నెపంతో ప్రభుత్వం, సినిమారంగ పెద్దలు ఎక్కడ ఆ నివేదికను బుట్టదాఖలు చేస్తారన్న ఆందోళనే! ఇంకెంతకాలం సమస్యను గుప్పిట దాచి ఉంచుతారు? ఇప్పటికైనా నివేదికను ప్రభుత్వం బహిర్గతం చేయాలి. దీనిమీద చర్చించాలని సినీ పెద్దలకు నా సూచన." సినీ పరిశ్రమలోని 24 క్రాఫ్టులు, యూనియన్లలో సైతం నిర్ణయాధికారాల్లో అరకొర మినహా మహిళలు లేకపోవడం ఆ రంగంలోని మగస్వామ్యానికి నిదర్శనం. డ్యాన్స్, మేకప్, ఇతర యూనియన్ బాధ్యుల్లోని మగవాళ్ల దయాదాక్షిణ్యాల ఆధారంగా మహిళలకు పని అవకాశాలు వస్తాయి. అన్యాయాన్ని ప్రశ్నిస్తే భవిష్యత్తు ప్రశ్నార్థకమే! చిత్రీకరణ ప్రదేశాల్లో దుస్తులు మార్చుకోడానికి అనువైన గది, మరుగుదొడ్లు లాంటి కనీస వసతులను కూడా ఏర్పాటు చేయరు. వీటన్నిటిమీదా క్షుణ్ణంగా పరిశీలించిన సబ్ కమిటీ 50 పేజీలకుపైగా నివేదికను తయారు చేసి హైపవర్ కమిటీలోని వారందరితో పాటు అప్పటి ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి, మిగతా శాఖల అధికారులకు 2022లో అందించాం. ఇప్పటివరకు దాని ఊసేలేదు.

# తెలంగాణ ఆర్థిక ప్రగతికి కేంద్రం కితాబు

రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి సాగు రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని సర్వే వెల్లడించింది. 2014లో కేవలం 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం.. కాళేశ్వరం, మిషన్ కాకతీయ వంటి పథకాల ఫలితంగా 2023 నాటికి 2.21 కోట్ల ఎకరాలకు చేరుకుంది. అయితే, ప్రకృతి విపత్తుల కారణంగా హెక్టారుకు వచ్చే దిగుబడి జాతీయ సగటు కంటే తక్కువగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేసింది. పరిశ్రమలు, ఉపాధి రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో ఉంది. మహిళల రక్షణ కోసం హైదరాబాద్‌లో అమలు చేస్తున్న 'షీ టీమ్స్' ఒక కీలకమైన మరియు ప్రభావవంతమైన విధానమని కేంద్రం కొనియాడింది. ఉత్పాదక రంగంలో 60 శాతం ఉపాధి కల్పిస్తున్న టాప్-7 రాష్ట్రాల్లో తెలంగాణ చోటు దక్కించుకుంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. 2018 ధరల ప్రకారం హైదరాబాద్ జీడీపీ ప్రస్తుతం 50.6 బిలియన్ డాలర్లు కాగా.. 2035 నాటికి ఇది ఏకంగా 201.4 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ప్రపంచ బ్యాంక్ అంచనాలను సర్వే ఉటంకించింది. 'భూ భారతి' పోర్టల్ ద్వారా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ విభాగాలను ఏకీకృతం చేయడాన్ని ఒక గొప్ప సంస్కరణగా అభివర్ణించింది.

న్యూయార్క్, లండన్ వంటి గ్లోబల్ సిటీల స్థాయికి మన మెట్రో నగరాలను తీసుకెళ్లడంలో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ.. ఆర్థిక ప్రగతిలో (8.47 శాతం వృద్ధి రేటు) హైదరాబాద్ మిగతా నగరాల కంటే ముందంజలో ఉండటం తెలంగాణకు కలిసొచ్చే అంశం. అటు పారిశ్రామికంగా, ఇటు సామాజిక భద్రతలో రాష్ట్రం చూపిస్తున్న చొరవ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు

ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు విచారణకు రావాలని తనకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఈ మేరకు సిట్‌కు ఆయన సమాధానం ఇచ్చారు. తాను రేపు విచారణకు రాలేనని, శుక్రవారమే మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ అని అందులో ప్రస్తావించారు. అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉందని తెలిపారు. విచారణకు మరో రోజు కేటాయించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా తాను విచారణకు సహకరిస్తానని పేర్కొన్నారు. అలాగే తనను ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లోనే విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. 160 సీఆర్పీసీ కింద విచారణను ఒకే ప్రాంతంలో చేయాలనే నిబంధనలు ఏమీలేవని గుర్తు చేశారు. భవిష్యత్తులో నోటీసులను ఎర్రవల్లికే పంపించాలని ఆ లేఖలో కోరారు.

# హైదరాబాద్‌లో హైడ్రా కొరడా

హైదరాబాద్ నగరంలో అగ్నిమాపక భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఉక్కుపాదం మోపింది. ఇటీవల నాంపల్లిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసిన అధికారులు.. గురువారం జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ వస్త్ర దుకాణం 'నీరూస్' తో పాటు నాంపల్లిలోని మరో ఫర్నిచర్ షోరూంను సీజ్ చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లోని నీరూస్ షోరూంలో తనిఖీ చేయగా తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి. మూడు సెల్లార్లు, నాలుగు అంతస్తులతో పాటు, అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన రూఫ్ షెడ్‌లో కూడా భారీగా వస్త్రాలను నిల్వ ఉంచడాన్ని అధికారులు గుర్తించారు. ఫైర్ సేఫ్టీ ఎన్వోసీ లేకపోవడం, మంటలను ఆర్పే పరికరాలు సరిగా లేకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనంపై అంతస్తులను గోదాముగా, వస్త్రాల తయారీ కేంద్రంగా మార్చడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. వెంటనే షోరూంను సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం అధికారులు నాంపల్లి స్టేషన్ రోడ్డులోని రహీమ్, మన్నన్ ఎస్టేట్స్ స్టాండర్డ్ ఫర్నిచర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఇటీవల ఐదుగురి మృతికి కారణమైన ప్రమాదం జరిగిన రోడ్డులోనే ఉన్నప్పటికీ ఈ షోరూంలో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకపోవడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. ఆరు అంతస్తుల భవనంలో మెట్ల మార్గాన్ని కూడా మూసివేసి ఫర్నిచర్ నిల్వ ఉంచడం, కనీసం ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కూడా లేకపోవడంతో ఈ షోరూంను కూడా సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ రెండు షోరూంల వద్ద 'ఫైర్ అన్ సేఫ్' బోర్డులను ఏర్పాటు చేసి, హైడ్రా ఫెన్సింగ్ వేశారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నగరంలో ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘిస్తే, తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజలను కోరారు. హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 9000113667 లేదా తన వాట్సాప్ నంబర్ 7207923085కు ఫొటోలు, వీడియోలతో సహా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# ఆ విమానం అతను నడపాల్సింది కాదు

ముంబై నుంచి బయలుదేరిన 'లియర్ జెట్ 45' విమానం బారామతి విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యే క్రమంలో ప్రమాదానికి గురైంది. పొగమంచు వల్ల సరిగ్గా కనిపించకపోవడంతో రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తున్నప్పుడు ఈ ఘోరం జరిగింది. ఈ ప్రమాదంలో సుమిత్ కపూర్‌తో పాటు కో-పైలట్ శాంభవి పాఠక్, అసిస్టెంట్ పింకీ మాలి, సెక్యూరిటీ గార్డ్ విదిప్ జాదవ్, అజిత్ పవార్ అక్కడికక్కడే మరణించారు. వాయవ్య వాతావరణ పరిస్థితుల వల్ల 'పైలట్ అంచనా తప్పి ఉండొచ్చు' అని ప్రాథమిక విచారణ సంస్థలు భావిస్తుండగా, సుమిత్ స్నేహితులు దీన్ని కొట్టిపారేస్తున్నారు. ఆయనకు వేల గంటల విమానయాన అనుభవం ఉందని, సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం ఎంత భయంకరంగా జరిగిందంటే.. మృతదేహం గుర్తుపట్టలేనంతగా కాలిపోగా, సుమిత్ చేతికి ఉన్న బ్రాస్‌లెట్ చూసి ఆయనను గుర్తించాల్సి వచ్చింది. సుమిత్ కపూర్ కుటుంబమంతా పైలట్లతో నిండి ఉంది. ఆయన కుమారుడు, అల్లుడు కూడా పైలట్లుగా పనిచేస్తున్నారు. విమానాలంటే ప్రాణమిచ్చే సుమిత్, చివరకు ఆ ఆకాశంలోనే కలిసిపోవడం ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. "చనిపోవడానికి కొద్దిసేపటి ముందే తన ఆరోగ్యం గురించి జాగ్రత్తలు చెప్పాడని, ఇంతలోనే ఇలా జరుగుతుందని నమ్మలేకపోతున్నాం" అని ఆయన మిత్రుడు జి.ఎస్. గ్రోవర్ ఆవేదన వ్యక్తం చేశారు.

# ఏపీకి త్వరలో 750 ఎలక్ట్రిక్ బస్సులు

ఆంధ్రప్రదేశ్ రవాణా రంగంలో కీలక మార్పులకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, త్వరలోనే రాష్ట్రానికి 750 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. విజయవాడలోని ఆర్టీసీ కార్యాలయంలో నిన్న స్త్రీశక్తి పథకంపై ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. స్త్రీశక్తి పథకం అమలులోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఇప్పటివరకు సుమారు 40 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకాన్ని ప్రభుత్వం భారంగా కాకుండా, ప్రజల పట్ల బాధ్యతగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ విజయానికి 48 వేల మంది ఆర్టీసీ సిబ్బంది కృషే ప్రధాన కారణమని ఆయన ప్రశంసించారు. రాష్ట్రంలో ప్రజారవాణా వ్యవస్థను మరింత ఆధునికీకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రెట్రోఫిట్మెంట్ బస్సులపై పరిశీలన కొనసాగుతోందని, అధునాతన సౌకర్యాలతో కూడిన ఎలక్ట్రిక్ బస్సులను త్వరలో అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. పల్లెవెలుగు సర్వీసుల్లోనూ ఏసీ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళలు ఉచితంగా ప్రయాణించేలా అన్ని ప్రాంతాల్లోనూ ఏసీ బస్సులను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పరిష్కారం కాని అనేక సమస్యలను కూటమి ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తోందని రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

టికెట్ ఆదాయంపైనే ఆధారపడకుండా ఆర్టీసీ కార్గో సర్వీసుల ద్వారా రూ.200 కోట్ల ఆదాయం ఆర్జించిందని మంత్రి వెల్లడించారు. కార్గో ఆదాయంలో అగ్రస్థానంలో నిలిచిన జిల్లా అధికారులను ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలతో సత్కరించారు. అనంతరం విజయవాడ బస్టాండ్‌లోని కార్గో సర్వీసు నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు.

# అధైర్య పడొద్దు... అండగా నేను ఉంటా

- గ్రామ సర్పంచ్ అమీనాఅశోక్ రాథోడ్



కల్వకుర్తి, జనవరి 29 వార్త మిర్రర్ ప్రతినిధి:– జేపల్లి గ్రామ పంచాయతీకి చెందిన జల్లెల జంగయ్య అనారోగ్య కారణాలతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ అమీనా అశోక్ రాథోడ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం రూ.3,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్ తో పాటు మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ మధు, వార్డు సభ్యులు భాస్కర్, భాష, నరేశ్, తిరుపతయ్య, గ్రామస్తులు గోవర్ధన్ రెడ్డి, దోస్తీ ఫౌండేషన్ రమేష్, శ్రీను, అరవింద్, జల్లెల నర్సింహ, తగుళ్ల నరసింహ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు .

## నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన పుల్లెంల సగర సంఘం నాయకులు



చండూర్ వార్త మిర్రర్ ప్రతినిధి చండూరు మండలం పుల్లెంల గ్రామ సాగర సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సగర సంఘం క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సగరులు ఐక్యమత్యంతో రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో సగరులు పోటీ చేస్తే వారి గెలుపుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నలగొండ కార్యవర్గ సభ్యుడు గంట రాములు సాగర్, కొలుగూరి ప్రవీణ్ సాగర్ పుల్లెంల సాగర సంఘం అధ్యక్షుడు రాసాల వెంకన్న సాగర్, ఉపాధ్యక్షుడు గంట సాయి సాగర్, కార్యదర్శి నేర్ల కంటి రాజు సాగర్, కార్యవర్గ సభ్యులు నేర్లకంటి కుమార్ సాగర్, గంట నవీన్ సాగర్, రాసాల రమేష్ సాగర్, పెండాల సత్తయ్య, సాగర్ నేర్లకంటి శివసాగర్, ఉంగరాల సత్తయ్యసాగర్, పెండాల రాజు సాగర్, నేర్లకంటి మల్లమ్మ, రాసాల మహేష్ సాగర్, సగర బంధువులు పాల్గొన్నారు

## యాదగిరిగుట్టకు నూతన ఈవో గా బాధ్యతలు స్వీకరించిన భవానీ శంకర్

- స్వాగతం పలికిన ఆలయ అధికారులు, అర్చకులు



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి యాదగిరిగుట్ట కు నూతన ఈవోగా బాధ్యతలు స్వీకరించిన భవాని శంకర్, స్వాగతం పలికిన ఆలయ అధికారులు, అర్చకులు ప్రధాన ఆలయంలోని స్వయంభు మూర్తులను దర్శించుకున్న ఆలయ ఈవో. వేద ఆశీర్వచనం చేసిన ఆలయ పండితులు.తన చాంబర్ లో పదవి బాధ్యతలు స్వీకరించిన భవాని శంకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయ పరిపాలన, ఆర్థిక నిర్వహణ మరియు భక్తులకు సౌకర్యాలను మెరుగుపరుస్తానని తెలిపారు

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కి మైకు సెట్, బాక్స్ ల వితరణ



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 29 గణతంత్ర దినోత్సవం సందర్భంగా... జగిత్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కి 60,000 విలువ గల మైకు సెట్, బాక్స్ లు తేలు నరేష్ మన్నెగూడం వాస్తవ్యులు వితరణ చేయడం జరిగింది. వారికి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. స్థానిక భీమారం గ్రామ ప్రజలు, సర్పంచ్, ఉప సర్పంచ్, పాలక వర్గ సభ్యులు కూడా అభినందించారు......

## నిలువెత్తు బంగారం తో (బెల్లం)తులాభారం సమర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి 29 జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో శ్రీ వెంకటేశ్వర ఆలయంలో వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ఈ సందర్భంగా రాయికల్ మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు మహేంద్ర బాబు గారు జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ కుమార్ 2023లో గెలుపొందాలని వెంకటేశ్వర స్వామి వారిని మొక్కుకోగా ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ నిలువెత్తు బెల్లం జోకి తులాభారం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయికల్ పట్టణ అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తా...గౌరవ ముఖ్యమంత్రి 5కోట్ల ఎస్ డి ఎఫ్ నిధులు మంజూరు చేయటం జరిగింది..రాయికల్ పట్టణ అభివృద్ధి కి నిధులు కేటాయిస్తా..రాయికల్ పట్టణ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కి నిధులు మంజూరు చేస్తా..రాయికల్ పట్టణంలో హనుమాన్ ఆలయం,గుడి కోట ఆలయ అభివృద్ధి కి నిధులు మంజూరు చేయటం జరిగింది. రాయికల్ పట్టణ అభివృద్ధి కి 15 కోట్లు మంజూరు చేయగా ఇటీవల మంత్రి తో కలసి 7 కోట్ల 20 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ చేయటం జరిగింది. మరొక 7 కోట్ల 80 లక్షలతో అతిత్వరలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తాం అన్నారు. అన్నివర్గాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తా అన్నారు. మన మతాన్ని ప్రేమిస్తూ ఇతర మతాలను గౌరవించాలి అన్నారు ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు, మాజీ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి అచ్యుత రావు, పడిగల రవీందర్ రెడ్డి, కోల శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, ఆలయ చైర్మెన్ గంగాధర్, మహేంద్ర బాబు, మోర రామ్మూర్తి, రాయికల్ పట్టణ, మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ ఇందిరానగర్‌లో నెలలుగా అస్తవ్యస్తమైన సీసీ రోడ్డు

- పిల్లల చదువు, అత్యవసర సేవలకు తీవ్ర అంతరాయం




వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 29 జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ 3వ వార్డులో గత రెండు నెలల క్రితం మరమ్మత్తుల నెపంతో సీసీ రోడ్డు, లోకల్ వాటర్ పైపులైన్‌ను పగలగొట్టి వదిలేయడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో కాలనీవాసులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. మూడో వార్డులోని ప్రధాన సీసీ రోడ్డుపై అనుకోని ప్రైమరీ స్కూల్ ఉండటంతో విద్యార్థుల రోజువారీ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుపై తవ్వి వదిలేసిన గుంతల వల్ల చిన్నారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. అదే విధంగా అత్యవసర సమయాల్లో అవసరమయ్యే 108 అంబులెన్స్‌లు, ఇతర సేవా వాహనాలు రాకపోవడం కాలనీవాసుల్లో భయాందోళనలకు కారణమవుతోంది. ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఇదే ప్రాంతానికి సమీపంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయనుండటం. గుంతలు, ధ్వంసమైన రోడ్డు కారణంగా ఓటర్లు పోలింగ్‌కు వచ్చే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై సంబంధిత అధికారులు, మున్సిపల్ యంత్రాంగం వెంటనే స్పందించి తక్షణమే చర్యలు తీసుకుని సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఇందిరానగర్ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

## మండల స్థాయి సీఎం కప్ పోటీలలో గ్రీన్ వుడ్ విద్యార్థుల విజయకేతనం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 29 జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో జరిగిన మండల స్థాయి సీఎం కప్పు పోటీలలో గ్రీన్ వుడ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దీనిలో గర్ల్స్ విభాగంలో మండల స్థాయిలో వాలీ వాలీబాల్ విభాగంలోమొదటి స్థానం లో, ఖో ఖో విభాగంలో రెండో స్థానంలో నిలిచారు. దీనిలో ముఖ్య అతిథులుగా అడిషనల్ ఎస్పీ శైలేంద్రనీ రెడ్డి, రాయికల్ సబ్ ఇన్స్పెక్టర్ సుధీర్ రావు, ఎంపీడీవో బి.చిరంజీవి, మండల విద్యాధికారి రాఘవులు, పిడి కృష్ణ ప్రసాద్, వివిధ పాఠశాలల పీడీలు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ శైలేంద్రిని రెడ్డి విద్యార్థులను అభినందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ మిట్టపల్లి మహేష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## నామినేషన్ల ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీ ఎం. హనుమంతరావు



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 29 చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ శ్రీ ఎం. హనుమంతరావు గురు వారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు.నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన రిజిస్టర్లను, అభ్యర్థులు సమర్పించిన పత్రాలను కలెక్టర్ రిటర్నింగ్ అధికారుల దగ్గర క్షుణ్ణంగా పరిశీలిస్తు, ఆర్వో లతో చర్చించారు.ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ జరుగుతుందా లేదా అని ఆర్.డి.ఓ.ఆర్వో, ఏఆర్వో లను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు.నామినేషన్ల పర్వం ముగిసే వరకు ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పిస్తూ, ఎటువంటి గందరగోళం లేకుండా చూడాలని కమిషనర్ జి. వెంకట్రామ్ రెడ్డిని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద సి.సి. కెమెరాల నిఘా పోలీస్ బందోబస్తుపై ఆర్.డి.ఓ. శేఖర్ రెడ్డితో చర్చించి,శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉండాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్ గారి ఆదేశాల మేరకు అభ్యర్థుల కోసం అన్ని మౌలిక వసతులు, కంట్రోల్ రూమ్,సహాయ కేంద్రము(హెల్ప్ డెస్క్) కల్పించామని, నామినేషన్ల స్వీకరణ సజావుగా సాగుతోందని వివరించారు.ఈ తనిఖీలో ఎన్నికల విభాగానికి చెందిన ఆర్వో లు, ఏఆర్ఓ లు అధికారులు, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చైనా మాంజా పై మాదాపూర్ పోలీసుల స్పెషల్ డ్రైవ్...

- ప్రమాదకరంగా వేలాడుతున్న నిషేధిత మాంజా తొలగింపు....





మాదాపూర్ వార్త మిర్రర్ : రోడ్లు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, నివాస ప్రాంతాల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న నిషేధిత చైనీస్ మాంజా తొలగింపునకు గురువారం మాదాపూర్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పై అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. ఈ చైనీస్ మాంజా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, పక్షులు, జంతువులకు తీవ్ర ప్రమాదం కలిగిస్తుందని విధితమే. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా ఈ స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్. ఐ. లు బలరామ్, రాఘవేందర్, మరియు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో, అధికారుల సహకారంతో కాకతీయ హిల్స్, కావూరి హిల్స్ కాలనీ లో ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు, రోడ్లు, భవనాలు తదితర వాటిపై ప్రమాదకరంగా వేలాడుతున్న మాంజాను తొలగించారు. అలాగే గాలిపటాలు, మంజా విక్రయ దుకాణాల్లో తనిఖీలు చేశారు. వీటిని వినియోగించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దుకాణాలు, వ్యాపార కేంద్రాలను తనిఖీ చేశారు. చైనీస్ మాంజా వాడకం చట్ట విరుద్ధమని, కొన్నా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. చైనా మాంజా చట్ట విరుద్ధమని, దాని తయారీ, విక్రయం, నిల్వ లేదా వినియోగం నేరమని, ఇటువంటి చర్యలపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. చైనీస్ మాంజా విక్రయం లేదా వినియోగం ఎక్కడైనా జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఎక్కడైనా మాంజా వేలాడుతూ కనిపిస్తే జాగ్రత్తగా దాన్ని తొలగించి డిస్పోజ్ చేయాలని పోలీసులు ప్రజలకు సూచించారు...


## ఘనంగా ఎస్. రామస్వామి జన్మదిన వేడుకలు....



మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్యామిలేటి రామస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మాదాపూర్ లోని అయ్యప్ప సొసైటీలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ సభ్యులు, నాయకులు, బంధుమిత్రులు, మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూకల ప్రేమ్ కుమార్ యాదవ్, ఈరన్ సురేష్, పవన్, సంజయ్, సుధాకర్,సర్దార్, నరేష్, జగన్, రమేష్, షేరణయ్య తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

## ప్రతీకర రాజకీయాలకు పరాకాష్ట

- హామీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్.!
- బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ గారికి ఫోన్ టాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అవినీతి అసమర్థత కప్పిపుచ్చుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ రథసారథి, కేసీఆర్ కు ఫోన్ టాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇచ్చారని విమర్శించారు. ఇది ప్రతీకార రాజకీయాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. కేసీఆర్ గారికి నోటీసులు ఇవ్వడం డైవర్షన్ పాలిటిక్స్ లో భాగమే అని అన్నారు. మా నాయకులకు ఎన్ని నోటీసులు ఇచ్చిన ఎన్ని అక్రమ కేసులు బనాయించిన మీరు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీలు అమలు చేసేదాకా ప్రభుత్వాన్ని వదిలిపెట్టమని హెచ్చరించారు. రేపటి మున్సిపల్ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలుసుకోవాలని తెలిపారు

## పాలక వర్గం ఉన్నా పర్యవేక్షణ కరువు

- మాజీ ఎంపీటీసీ సభ్యులు గోవిందుల లావణ్య–జలపతి



వార్త మిర్రర్ జగిత్యాల జనవరి 29 జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో త్రాగునీరు అందించాల్సిన బావి చుట్టూ పిచ్చి మొక్కలతో నిండి పోయి నిరుపయోగంగా ఉంది. గతంలో గ్రామానికి పాలకవర్గం లేక గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు పాలకవర్గం ఉన్నప్పటికీ త్రాగునీటి సమస్య అలాగే కొనసాగుతుంది. కనీసం బావికి మోటర్ లేకపోవడం తద్వారా ముఖ్యంగా బావి ద్వారా నీరు అందే ఎస్సీ్ కాలనీ వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని త్రాగు నీటి బావిని ఉపయోగంలోకి తేవాలి.

## విశ్వశాంతి ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సంభాషణ



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 29 జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ విచ్చేసి కళ్యాణ మండపం, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతూ తర్వాత విశ్వశాంతి హై స్కూల్ మేనేజ్మెంట్ మచ్చ గంగాధర్ తన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులతో ఇంటరాక్టింగ్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు ఎమ్మెల్యేని రకరకాల ప్రశ్నలతో వారి బాల్యాన్ని, విద్యాభ్యాసాన్ని గుర్తు చేసారు. ఎమ్మెల్యే విద్యాభ్యాసం, వారు డాక్టర్ వృత్తిని చేపట్టడంలో ఎదుర్కొన్న విశేషాలను విద్యార్థులు అడగగా ఎమ్మెల్యే ఎంతో ఓపికతో వారికి సమాధానాలు ఇచ్చారు. అలాగే ప్రస్తుత రోజుల్లో మీరు ఉన్నటువంటి రాజకీయ జీవితం, మీ యొక్క డాక్టర్ వృత్తి ఇందులో మీకు ఏది చాలా సంతృప్తిని ఇస్తుంది అని పిల్లలు అడగగా, ఎమ్మెల్యే నాకు డాక్టర్ వృత్తి చాలా సంతృప్తిని ఇస్తుంది అని తెలియజేశారు. తర్వాత10వ తరగతి పరీక్షల విధానం గురించి విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించి మంచి మార్కులు సాధించాలని ఆల్ ది బెస్ట్ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు మహేష్, సంజన ,రజిత వెంకటేష్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం కెనాల్ నుంచి నీటి విడుదల చేయాలని-- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు వినతి



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని జేతురం తండా, ములకలపల్లి, మొతిరం తండా, రాంపూర్ తండా వివిధ తండాలు ప్రజలు కాళేశ్వరం కెనాల్ నీటిమీద ఆధారపడి వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నాయి, ప్రస్తుతము కెనాల్ లో నీటి మట్టం చాలా తగ్గిపోయింది, రైతులు పొలాలు ఎండిపోయే పరిస్థితులో ఉన్నాయి, కావున ముందస్తుగా మా యందు దయ తలచి కెనాల్ లో నీటిని విడుదల చేయవలసిందిగా 6 గ్రామా పంచాయతీ ప్రజల నుండి వినతి పత్రం అందించిన జైతురం తండా గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్, మొతిరం తండా గ్రామపంచాయతీ సర్పంచ్ ధరావత్ కమ్లి సురేష్, ములకలపల్లి సర్పంచ్ భనోత్ భూమి వీరన్న, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కొరకు తప్పకుండా నీటి విడుదలకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది,ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ,తదితరులు పాల్గొన్నారూ

# మీడియా టుడే దిన పత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే సంజయ్..



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 29 జగిత్యాల పట్టణంలో ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రముఖ జాతీయ దినపత్రిక "మీడియా టుడే" క్యాలెండర్ ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాయటంలో, సమస్యలను వెలికితీయటంలో పత్రికల పాత్ర ఎంతో ఉందని , అనతి కాలంలో నే మీడియా టుడే పత్రిక తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మీడియా టుడే చీఫ్ ఎడిటర్ ఏ.ఎం. రాజురెడ్డి, ఎడిటర్ కడకుంట్ల జగదీశ్వర్, వార్తా పత్రిక జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎల్లాల రాజేందర్ రెడ్డి, సాక్షి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కందుకూరి శశిధర్, సిక్స్ టీవీ ఉమ్మడి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ప్రవీణ్ కుమార్ ,భారత్ టుడే రిపోర్టర్ సిరిసిల్ల వేణుగోపాల్, నమస్తే తెలంగాణ రూరల్ రిపోర్టర్ బండ స్వామి, బి ఆర్ కె స్ట్రింగర్ గాజుల మహేష్, మహా న్యూస్ స్ట్రింగర్ రఘు ఐ న్యూస్ స్ట్రింగర్ శ్రీకాంత్ గౌడ్, మేఘ9 స్ట్రింగర్ చందు మరియు మీడియా టుడే రిపోర్టర్ లవులి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల వివరాల వెల్లడి కమిషనర్ జి.వెంకట్రాంరెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 29 చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా 29-01-2026 రోజున నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం రెండవ రోజు ముగిసిందని మున్సిపల్ కమిషనర్ గుత్త వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని మొత్తం 20 వార్డులకు గాను నేడు 59 నామినేషన్లు దాఖలైనట్లు వివరించారు. వార్డుల వారీగా వివరాలు కమిషనర్ వెల్లడించిన వివరాల ప్రకారం..2వ వార్డులో అత్యధికంగా 6 నామినేషన్లు రాగా,5, 10,18వ,వార్డుల నుండి ఐదుగురు చొప్పున అభ్యర్థులు నామినేషన్లు వేశారు.17వ వార్డులో నేడు ఎటువంటి నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన వార్డులలో 1 నుండి 4 వరకు నామినేషన్లు స్వీకరించబడ్డాయి.పార్టీల వారీగా నామినేషన్ల సరళి: దాఖలైన మొత్తం 59 నామినేషన్లలో పార్టీల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి

బి ఆర్ ఎస్ : 16 కాంగ్రెస్: 15 బీజేపీ: 15 సిపిఐ: 05 ఇండిపెండెంట్లు: 04 సిపిఎం: 02 టి ఆర్ పి : 02 ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందని, అభ్యర్థులు మరియు రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్ పాటిస్తూ అధికారులకు సహకరించాలని కమిషనర్ కోరారు.

# వనస్థలిపురం ఎఫ్సిఐ కాలనీ ప్రధాన రహదారిలో తెలంగాణ మీట్ స్టోర్ ప్రారంభం

**– మీట్ స్టోరీని ప్రారంభించిన కార్పొరేటర్ రావుల వెంకటేశ్వర్ రెడ్డి**



ఎల్బీనగర్ 29 జనవరి గ్రామీణ ప్రాంతాలలో పెరుగుతూ ఆకులు, అలములు తింటూ సహజంగా పెరుగుతున్న గొర్రె పొట్టేళ్ల మాంసము అమ్మకానికి వనస్థలిపురం ప్రాంతంలో మీట్ స్టోన్ ఏర్పాటు చేయడం శుభ సూచకమని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రావుల వెంకటేశ్వర్ రెడ్డి ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్సీఐ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ మీట్ స్టోర్ నీ వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బుధవారం ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బి ఎన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, తెలంగాణ మీట్ స్టోర్ యజమానులు శ్రీనివాస్ రెడ్డి, జ్ఞానేశ్వర్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాషం అశోక్ గౌడ్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, ఎఫ్సీఐ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నరసింహారావు, ఉపాధ్యక్షులు రాజు యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు, వీరస్వామి గౌడ్, రవి శంకర్, మల్లికార్జున్ నగర్ కాలనీ అధ్యక్షులు నర్సి రెడ్డి , క్రిస్టిన కాలనీ అధ్యక్షులు హరిందర్ రెడ్డి , హస్తినాపురం ఈస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కుంచారపు భూపతి రెడ్డి , గుంటి జంగయ్య కాలనీ నివాసి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం కొత్తపేటలో చెట్ల తొలగింపుపై ఫారెస్ట్ అధికారుల విచారణ

**– ఆలయ కమిటీ క్షమాపణలు**

**– కొత్త మొక్కలు నాటుతామని హామీ**



ధర్మవరం, జనవరి 29 (ప్రజా సమాచార్) శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని కొత్తపేటలో ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఎదుట చెట్లను తొలగించిన ఘటనపై ఫారెస్ట్ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. విషయం తెలియగానే ఫారెస్ట్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సెక్రటరీ దత్త శివ మాట్లాడుతూ, చెట్ల తొలగింపు విషయం తమ దృష్టికి రాగానే అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా చెట్లు నరికినందుకు సంబంధిత సిబ్బందిపై ఫారెస్ట్ అధికారులు చలానా విధించినట్లు వెల్లడించారు. తొలగించిన చెట్ల స్థానంలో మళ్లీ కొత్త మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటామని ఆలయ కమిటీ హామీ ఇచ్చింది. ఈ విషయంలో జరిగిన పొరపాటుకు ప్రజలు, మీడియా మిత్రులు క్షమించాలని కోరారు. అలాగే ఆలయం ముందు ఉన్న కాంపౌండ్ వాల్ కొంత భాగం దెబ్బతినడంతో అదే ప్రాంతంలో కొత్త కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు ఆలయ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కేవలం చెట్ల పై కొమ్మలను మాత్రమే తొలగించాలనే ఉద్దేశంతో పనులు ప్రారంభించగా, అనుకోకుండా పూర్తిగా చెట్లు తొలగించినట్లు స్పష్టం చేశారు. ఈ ఘటనపై స్థానికంగా చర్చ కొనసాగుతుండగా, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

# ఆర్ఎస్ఎస్ శతాబ్ది సభ ఘన విజయం

**– 'భవిష్యత్ భారత్' నిర్మాణానికి సమిష్టి కృషి అవసరం**


**– మోహన్ భగవత్**

విజయవాడ, జనవరి 29 రాష్ట్రీయ స్వయంసేవక సంఘం (ఆర్ఎస్ఎస్) వంద సంవత్సరాల పూర్తి సందర్భంగా విజయవాడలోని స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆడిటోరియంలో గురువారం ఘనంగా శతాబ్ది సమావేశం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం రెండు గంటల పాటు కొనసాగింది. ఈ సమావేశానికి ఆర్ఎస్ఎస్ జాతీయ చీఫ్ డా. మోహన్ భగవత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయనతో పాటు దక్షిణ భారత ప్రాంతీయ సంచాలకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘ్ ప్రముఖులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సంఘ్ ముఖ్య నాయకులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సభకు విశేష ప్రాధాన్యతను అందించారు. మోహన్ భగవత్ ప్రసంగిస్తూ, పంచ ప్రణాళిక విధానం ద్వారా కుటుంబ వ్యవస్థ బలోపేతం, దేశాభివృద్ధి, జాతీయవాద పటిష్టత లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందని తెలిపారు. హిందూ సమ్మేళనాల ద్వారా కోట్లాది మందిని ఏకం చేస్తూ సంఘం దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. భారతదేశంతో పాటు పలు దేశాలలో ఆర్ఎస్ఎస్ విధానాలపై ఆసక్తి పెరుగుతోందని, స్వచ్ఛందంగా వాటిని అధ్యయనం చేసి అమలు చేయడానికి ప్రజలు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. నేటి యువత సామాజిక స్పృహతో ముందుకు వచ్చి జాతీయవాద బలపాటుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భారత సాంస్కృతిక సంప్రదాయాలకు కుటుంబ వ్యవస్థే పునాదని పేర్కొన్న భగవత్, ఆర్థిక, వాణిజ్య, సైనిక రంగాల్లో భారత్ ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందుతోందన్నారు. ఈ సందర్భంగా 26 జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధుల ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. భవిష్యత్తులో సంఘ్ నిర్వహించే కార్యక్రమాల్లో మేధావులు, విద్యార్థులను భాగస్వాములుగా చేసుకొని యువతను నాయకత్వానికి సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రాంతీయ స్థాయిలో సంఘం అభివృద్ధి,



ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చ అనంతరం శతాబ్ది సమావేశం విజయవంతంగా ముగిసింది.

# గరుడ వాహనంపై శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దర్శనం



ధర్మవరం: జనవరి 29 శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మరియు శ్రీ గణపతి సచ్చిదానంద దత్త జ్ఞాన బోధ సభ ట్రస్ట్ కమిటీ సభ్యులు మేటికల కులయప్ప, దత్త శివ, బిల్లే నాగప్ప, సాగ సురేష్, శంకర సంజీవులు, రంగా, శీనా, గుద్దటి రామాంజనేయులు తెలిపారు. వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజున ఆలయంలో విశ్వకేశన ఆరాధన, ధ్వజారోహణం, నిత్య హోమాలు అర్చకులు సుదర్శనాచార్యులు, నాగనరసింహ సుదర్శనులచే వేదమంత్రోచ్చారణలతో, మంగళ వాయిద్యాల మధ్య నిర్వహించామని తెలిపారు. అదేవిధంగా ఉదయం పెద్దశేష వాహనంపై, రాత్రి గరుడ వాహనంపై స్వామివారు పట్టణ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారని తెలిపారు. పెద్దశేష వాహన సేవకు ఉభయ దాతలుగా సీతారామయ్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సీతారామయ్య, సతీమణి లక్ష్మీదేవి వ్యవహరించగా, గరుడ వాహన సేవకు బయనగారి సుకుమారి, బయనగారి నాగరాజు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఉభయ దాతల పేర్లపై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా సత్కరించామని తెలిపారు. ముందుగా మూలవిరాట్ విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు భక్తాదుల సహకారంతో నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తాదులు, దాతలు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఎస్డిహెచ్ఎస్ వాలంటీర్లు, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్



ధర్మవరం జనవరి 29 శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం;!జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24-7 ప్రకారం నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ధర్మవరం పట్టణం మార్కెట్ యార్డ్ లో ఉన్న ఈవీఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాల బియులు, సియూలు, వివి ప్యాట్ లను, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, తహశీల్దార్ సురేష్ బాబు , వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డోన్ నియోజకవర్గ అభివృద్ధికి వేగం

**– జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి కీలక భేటీ**



నంద్యాలజిల్లా డోన్ జనవరి 29: నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజ కుమారి గణియను గురువారం డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో డోన్ నియోజకవర్గంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై విస్తృతంగా చర్చించారు. డోన్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన రోడ్ల అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రభుత్వ కార్యాలయాల పనితీరు మెరుగుదలతో పాటు పలు ప్రజావసరాల సమస్యలను ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి, వేగవంతంగా చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజ కుమారి గణియ, ప్రభుత్వం అభివృద్ధి కోసం కేటాయిస్తున్న నిధులు సమర్థవంతంగా, పారదర్శకంగా వినియోగించబడేలా నిరంతర పర్యవేక్షణ చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలకు అత్యవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. అలాగే, కొన్ని కీలక అభివృద్ధి పనులకు తక్షణమే మంజూరు ప్రక్రియ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

# యాపదిన్నె రచ్చబండలో ప్రజలతో ముఖాముఖీ

**– సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి హామీ**





డోన్, జనవరి 29: డోన్ మండలంలోని యాపదిన్నె గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొని గ్రామ ప్రజలతో ముఖాముఖీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మమేకమై వారి సమస్యలు, అవసరాలు, అభివృద్ధికి సంబంధించిన సూచనలను శ్రద్ధగా విన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం మౌలిక సదుపాయాలతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. యాపదిన్నె గ్రామంలో రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారం, నూతన పెన్షన్ల మంజూరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాల మెరుగుదల, పాఠశాలలు మరియు ఇతర విద్యాసంస్థల అభివృద్ధి వంటి కీలక అంశాలపై గ్రామస్తులతో ఎమ్మెల్యే సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువతతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు, సూచనలు, ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు ప్రస్తావించిన సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో కూడా ప్రజలతో నిత్యం సంపర్కంలో ఉంటూ గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేదలకు కష్టం అంటే సీఎం చంద్రబాబు ఉదారంగా స్పందిస్తున్నారు



- సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా పరిటాల శ్రీరామ్
- నియోజకవర్గంలో 34మందికి రూ.17.10లక్షల చెక్కులు అందజేత
- ఇది పేదల పక్షాన ఉండే ప్రభుత్వమన్న శ్రీరామ్

ధర్మవరం జనవరి 29 శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పేదలకు ఆరోగ్యం విషయంలో ఏ కష్టం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ఉదారంగా స్పందిస్తున్నారని.. ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. నియోజకవర్గంలోని పలువురికి ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. మొత్తం 34మందికి 17.10లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు పరిటాల శ్రీరామ్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ కొన్ని సార్లు ఎన్టీఆర్ వైద్య సేవలు అందనివారు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి వారిని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చంద్రబాబు ఆదుకుంటున్నారన్నారు. ఇప్పటి వరకు ధర్మవరం నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా సీఎంఆర్ఎఫ్ కింద సాయం చేశారన్నారు. వైద్య పరంగా ఎవరికి కష్టం ఉన్నా.. ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు.

# అణచివేతను దాటి ఆకాశమే హద్దుగా

గులాబీ రంగులో మెరిసిపోతున్న ఆ 22 సీట్ల బస్సు డోరు తీసి డ్రైవర్ సీట్లో రాజసం ఉట్టిపడేలా కూర్చుంది 22 ఏళ్ల అనితాకుమారి. సైడ్ మిర్రర్ సర్దుతున్న సహాయకుడికి సూచన ఇస్తూనే ఒకసారి అద్దంలో చూసుకుని తాపీగా యాక్సిలరేటర్ నొక్కింది. అప్పటి వరకు ఆవరణలో నిశ్శబ్దంగా ఉన్న ఆ భారీ వాహనం అనిత చేతుల్లో పసిపాపలా కదిలింది. ఇది కేవలం ఒక బస్సు ప్రయాణం కాదు.. తరతరాల సామాజిక అణచివేతను దాటుకుంటూ సాగుతున్న ఆత్మగౌరవ ప్రయాణం. బీహార్ స్టేట్ రోడ్ ట్రాన్‌పోర్ట్ కార్పొరేషన్ చరిత్రలో తొలిసారిగా ఆరుగురు మహిళలు డ్రైవర్లుగా బాధ్యతలు చేపట్టారు. అనితతోపాటు బేబీ కుమారి (22), గాయత్రి (22), ఆర్తి(21), సరస్వతి (21), రాగిణి కుమారి (21).. ఈ ఆరుగురు యువతులు డ్రైవర్లు మాత్రమే కాదు.. బీహార్‌లోనే అత్యంత వెనుకబడిన 'ముషహర్' సామాజిక వర్గానికి బ్రాండ్ అంబాసిడర్లు. నిజానికి వీరి ప్రయాణం పూలబాట ఏమీకాదు. ఐదడుగుల కంటే తక్కువ ఎత్తుండే బేబీ కుమారిని చూసి 'నీ వల్లేం అవుతుంది' అని వెక్కిరించిన వారే ఎక్కువ. కానీ బేబీ గట్టి పట్టుదలతో నిలబడింది. గతంలో కనీసం సైకిల్ కూడా తొక్కడం రాని ఆమె నేడు భారీ ట్రక్కులను, బస్సులను అవలీలగా రివర్స్ గేర్‌లో పార్క్ చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఒకప్పుడు తన ఎత్తు గురించి ఇతరులు చేసే కామెంట్లకు బాధపడే బేబీ.. ఇప్పుడు స్టీరింగ్ పట్టుకుంటే తన ధైర్యం హిమాలయమంత ఎత్తుకు చేరుకుంటుందని చెబుతోంది. ఈ వృత్తి తనలో కొండంత ఆత్మవిశ్వాసాన్ని నింపిందని గర్వంగా చెప్పింది. ఈ మహిళా డ్రైవర్ల వెనుక 'సుధా దీదీ'గా పిలిచే సామాజిక కార్యకర్త సుధా వర్గీస్ కృషితోపాటు ప్రభుత్వ సహకారం కూడా ఉంది. పౌష్టికాహార లోపం, పేదరికం తాండవించే ముషహర్ కుటుంబాల్లోని ఆడపిల్లలు చదువు మధ్యలోనే ఆపేసి పెళ్లిళ్లు చేసుకునే సంప్రదాయాన్ని సుధా వర్గీస్ మార్చాలనుకున్నారు. వారిని డ్రైవింగ్ వైపు మళ్లించడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారు. అయితే సమాజం నుంచి ఎదురైన సవాళ్లు తక్కువేం కాదు. వివాహిత అయిన సరస్వతీ కుమారికి అత్తమామలను ఒప్పించడం పెద్ద సవాలుగా మారింది. 'బస్సు నడిపితే లోకం నవ్వుతుంది' అన్న వారి భయాలను దాటుకుని, నేడు తన భర్త గర్వంగా పదిమందికీ చెప్పుకునేలా ఆమె తనను తాను నిరూపించుకుంది.

# పటిష్ట పోలీసు భద్రత నడుమ ఘనంగా నిర్వహణ







శ్రీకాకుళం, జనవరి 29 : శ్రీకాకుళం జిల్లా గార మండలం శాలిహుండం గ్రామంలో గురువారం ఉదయం శ్రీ కాళీయమర్దన వేణుగోపాలస్వామి వారి చక్రతీర్థ స్నానాలు భక్తిశ్రద్ధలతో, అధిక సంఖ్యలో భక్తులు హాజరుతో, జిల్లా పోలీసు యంత్రాంగం ఏర్పాటు చేసిన పటిష్ట భద్రత నడుమ ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా వంశధార నదీ తీరంలో జరిగిన చక్రతీర్థ స్నానాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, శాంతిభద్రతలు సక్రమంగా కొనసాగేలా జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపీఎస్ ఆదేశాలు, సూచనల మేరకు శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ శ్రీ వివేకానంద్ పర్యవేక్షణలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం నుంచి నదీ తీరానికి వెళ్లే మార్గమధ్యంలో ప్రత్యేక బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు పటిష్ట బారికేడ్లను ఏర్పాటు చేసి జనసందోహాన్ని నియంత్రించారు.

కొండపై ఉన్న స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు క్రమబద్ధంగా క్యూలైన్ల ద్వారా దర్శనం చేసుకునేలా పోలీసు సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. భక్తులకు అవసరమైన మార్గనిర్దేశం, సహాయక చర్యలు అందిస్తూ పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించారు. పటిష్ట భద్రతా ఏర్పాట్ల ఫలితంగా వంశధార నదీ తీరంలో జరిగిన చక్రతీర్థ స్నానాలు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా పోలీసు శాఖ సమన్వయం, సమర్థవంతమైన బందోబస్తు ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఉపాధ్యాయ సమస్యలపై ఎస్ టి యు సమర శంఖం

డోన్ జనవరి 29: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం వెంటనే 30% మధ్యంతర భృతి ప్రకటించి, 12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని ఎస్టీయూ డోన్ మండలాధ్యక్షుడు రామ్మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎస్ టి యు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గుమ్మకొండ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దశల వారి పోరాటానికి సంబంధించిన కరపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ టి యు దశల వారి పోరాటంలో భాగంగా రేపు అనగా జనవరి 30 వ తేదీన రాష్ట్రంలోని ప్రతి తహసీల్దార్ కి వినతిపత్రం సమర్పించడం, ఫిబ్రవరి నెల 10 వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా, ఫిబ్రవరి 25వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరినారు.

ప్రధాన డిమాండ్లు:-

1. 30% మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి.
2. 12వ పి.ఆర్.సి కమిటీని వెంటనే నియమించాలి.
3. సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలి.
4. పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలి.
5. 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవ్స్ జీపీఎఫ్ మరియు మెడికల్ బిల్లుల రూపంలో బకాయి ఉన్న దాదాపు 34 వేల కోట్ల రూపాయలను వెంటనే చెల్లించాలి.
6. పదవీ విరమణ చేసిన ఉద్యోగికి మరుసటి రోజునే పెన్షన్స్ సౌకర్యాలు మరియు గ్రాడ్యుటీ అందజేయాలి.



ఈ సమావేశంలో ఎస్ టి యు నాయకులు హాజీ మస్తాన్ వలి, వేదావతి, ఉసేనమ్మ,శ్రీ సుధ మరియు పాఠశాల సిబ్బంది హుస్సేన్ భాష, కరీముల్లా, శిరీష,వీరేశ్వరమ్మ, కోమల, చంద్రమౌళి పాల్గొన్నారు.

# సర్వేయర్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు

- వంద శాతం అటెండెన్స్ నమోదు చేయాలి
- ప్రజల్లో మంచి పేరు వచ్చేలా పని చేయాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, జనవరి, 29:- సర్వేయర్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి హెచ్చరించారు. జిల్లాలో భూ సర్వే విభాగం పనితీరులో మరింత పారదర్శకత, బాధ్యత మరియు ప్రజల నమ్మకం పెంపొందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సర్వే డిపార్ట్మెంట్ కు సంబంధించిన ఎఫ్ పి ఓ ఎల్ ఆర్, రీ సర్వే, ఐవిఆర్ఎస్ కాల్స్, సర్వే కు సంబంధించిన అంశాలపై విలేజ్ సర్వేయర్లు, మండల సర్వేయర్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సర్వేయర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకటో, రెండో దరఖాస్తులు వస్తే అవి కూడా చేయలేరా అని ప్రశ్నించారు. నోటీసు ఇవ్వకుండా ఫీల్డ్ కు ఎలా వెళతారు అని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం సర్వే చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వేయర్ల మీద చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఇష్టం వచ్చినట్లు పనిచేస్తే కుదరదని కలెక్టర్ స్పష్టం చేశారు. రీ సర్వేలో డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల్లో మంచి పేరు వచ్చేలా పని చేయాలని సూచించారు. విలేజ్ సర్వేయర్లు అటెండెన్స్ వేయడం లేదని, ప్రతిరోజూ విధులకు హాజరైనట్లు వంద శాతం హాజరు నమోదు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. హాజరు నమోదు చేయని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేయర్లు తహసీల్దార్ కు రిపోర్ట్ చేయాలని, రెవెన్యూ శాఖతో సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే విభాగం పనితీరులో స్పష్టమైన మార్పు రావాలని, సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా టాప్--5 ర్యాంకులో నిలిచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. పబ్లిక్ పాజిటివ్ పర్ఫార్మెన్స్ సూచికల్లో జిల్లా మంచి స్థానాల్లో నిలవాలంటే ప్రతి ఉద్యోగి నిజాయితీగా, నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సర్వే కు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా సర్వే అధికారి ముని కన్నన్, ఆర్డీవో సందీప్ కుమార్, సంబంధిత అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.






# తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ ఎలా?



గద్దర్ జయంతి జనవరి 31కి సంబంధించి జనవరి 27న సోమాజిగూడ ప్రెస్క్లబ్లో గద్దర్ ఫౌండేషన్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. తెలంగాణ వాది పాశం యాదగిరి సహా అనేకమంది తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులు ఈ కార్యక్రమానికి వచ్చారు. తెలంగాణ ఉద్యమకారుడు కేశవరావు జాదవ్ జయంతి సభ కూడా ప్రెస్క్లబ్ ఆవరణలోనే మరో హాలులో జరుగుతున్నది. మా కార్యక్రమం తర్వాత జాదవ్ జయంతి కార్యక్రమంలో కూడా పాల్గొనాలని పాశం యాదగిరి అందరినీ పురమాయించారు. దాంతో నేను జాదవ్ జయంతి సమావేశంలోనూ పాల్గొన్నాను. ఆ కార్యక్రమంలో పాశం యాదగిరి, విమలక్క, విఠల్ తదితరులంతా తెలంగాణవాదులకు జరుగుతున్న విస్మరణ, వివక్ష గురించి ఆవేశంగా ప్రసంగించారు. త్యాగాలతో తెచ్చుకున్న తెలంగాణ తెర్లు అవుతున్నదనీ, తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టుకోకుంటే తిరిగి వలసాధిపత్యంలోకి వెళ్తుందనీ ఆవేదన చెందారు. తెలంగాణ అస్తిత్వాన్ని నిలుపుకునేది ఎట్లా? అనేది గంభీరమైన ప్రశ్న. ఆరు దశాబ్దాల పోరాటాలు, త్యాగాల ఫలం తెలంగాణ. రాష్ట్ర సాధన కల నెరవేరాక, రాష్ట్ర సాధనోద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన పార్టీని తెలంగాణ ప్రజలంతా ఆదరించారు, అందలమెక్కించారు. పదేండ్లు అధికారంలో ఉన్న ఆ పార్టీ ప్రజల ఆశలు, ఆకాంక్షల మేరకు పాలన అందించక పోవటంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. మరీ ముఖ్యంగా తెలంగాణ కోసం నిస్వార్థంగా, త్యాగపూరితంగా పనిచేసిన తెలంగాణవాదులను, ఉద్యమకారులను నాటి పాలకులు నిర్లక్ష్యం చేశారు. గద్దర్, అందెశ్రీ, కేశవరావు జాదవ్ లాంటి తెలంగాణ వాదులు, ఇందుకోసమేనా తెలంగాణ తెచ్చుకున్నది అని వాపోయే దుస్థితి ఏర్పడింది. పాలకుల నియంతృత్వ పోకడలతో విసిగి వేసారిన కళాకారులు 'ఎవని పాలైందిరో తెలంగాణ' అని ఆవేదనతో, కన్నీటితో పాడుకున్నారు. దాంతో ఉద్యమ పార్టీగా అధికారం చలాయించిన పార్టీని చిత్తుగా ఓడించి తెలంగాణ ప్రజలు మరో పార్టీని గెలిపించారు. ఓ సామాజికవేత్త అన్నట్లు ఎన్నికల జూదంలో పార్టీలు గెలుస్తుంటే, ప్రజలు మాత్రం పదేపదే ఓడిపోతున్నారు. తెలంగాణ వాదాన్ని నెత్తినెత్తుకొని త్యాగాలు చేసిన గద్దర్, కేశవరావు జాదవ్ లాంటి వారు ఏ పదవినీ, అధికారాన్నీ కోరుకోలేదు. ప్రజల ఆశలను, ఆకాంక్షలను ఎత్తిపడుతూ జీవితాంతం తెలంగాణ కోసం పరితపించారు. వారి త్యాగఫలమైన నేటి తెలంగాణలో ఎవరు అధికారంలో ఉన్నా, అది ఏ రంగు పార్టీ అయినా తెలంగాణ వాదులను గౌరవించటం ప్రథమ కర్తవ్యంగా ఉండాలి. చివరి ఊపిరి దాకా తెలంగాణ కోసం జీవించిన వారిని గుర్తించి గౌరవించటం, మన బాధ్యత. ఈ క్రమంలో వారి త్యాగాలను చిరస్థాయిగా నిలిపేందుకు వారి పేర్లను కొన్ని సంస్థలకు, వ్యవస్థలకు పెట్టి గౌరవించుకోవటం సముచితం. ఈ నేపథ్యంలోనే, ఇటీవల కన్నుమూసిన అందెశ్రీ పేరిట ప్రభుత్వం ఘట్కేసర్ సమీపాన ఓ స్మృతివనం నిర్మాణాన్ని తలపెట్టటం హర్షణీయం. గద్దర్ను కూడా అదే విధంగా గౌరవించుకునేలా ప్రభుత్వం ముందుకు రావాలి. ఎవరితోనూ సరిపోల్చలేని వ్యక్తి గద్దర్. సామాజిక ఉద్యమకారుడిగా, కవిగా, గాయకుడిగా, ప్రదర్శనకారుడిగా ప్రపంచంలోనే విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఈ ప్రత్యేకతను, విశిష్టతను గుర్తించి ప్రభుత్వం గద్దర్ స్మారక కళాక్షేత్రం నిర్మాణానికి ముందుకు రావడం ముదావహం. అయితే గద్దర్ కన్నుమూసి రెండేండ్లు గడుస్తున్నా భూమి కేటాయింపు జరగకపోవటంతో కళాక్షేత్రం నిర్మాణం ముందుకు పోవటం లేదు. తెలంగాణ ప్రజల ఆశలను, ఆకాంక్షలను గౌరవించాల్సిన బాధ్యత అందరిది. తెలంగాణ అస్తిత్వ ఉద్యమ కారుల స్మారక చిహ్నాలను రాష్ట్రం నడిబొడ్డున నిర్మించుకుందాం. ఆ దిశగా గద్దర్ స్మారక కళాక్షేత్రం నిర్మాణం కోసం గద్దర్ ఫౌండేషన్ శక్తివంచన లేకుండా కృషి చేస్తుంది.


# మహాత్ముడివి మూడు బాధలు!

సత్యమే దేవుడని నమ్మిన మహామనిషి మోహన్దాస్ కరమ్చంద్ గాంధీ. మన దేశపు భిన్నత్వంలోని ఏకత్వాన్ని మనసా వాచా కర్మణా నమ్మి ప్రజల మధ్య వైషమ్యాలు లేని సమైక్య భారతావనిని కలగన్న దార్శనికుడు. ఆయన సంప్రదాయవాది కాదు, అదే సమయంలో అభ్యుదయవాదీ కాదు. కేవలం ఇంగిత జ్ఞానంతో పనిచేసిన ఒక ఆదర్శవాది. గాంధీని జీవితాంతం బాధించిన విషయాలు ప్రధానంగా మూడు ఉన్నాయి. ఒకటి, హిందూ ముస్లిం ఐక్యత లేకపోవడం. రెండు, దళితులు అభ్యున్నతి పొందకపోవడం. మూడవది, దరిద్ర నారాయణుల్ని పేదరికం నుంచి బయట పడవేయలేకపోవడం. గాంధీ రచనలన్నిటా ఈ విషయాలే కీలకంగా ఉంటాయి. "నేను నమ్మే సిద్ధాంతాలు, ఆదర్శాలు వ్యాప్తిలో ఉన్నంత కాలం, మరణానంతరం సైతం జీవించే వుంటాను" అని చెప్పారాయన. 20వ శతాబ్ది రాజకీయ నాయకుల్లో అత్యధికంగా మానవాళిని ప్రభావితం చేసిన నాయకుడు గాంధీ. సత్యం, అహింస, సత్యాగ్రహం అనే విలువలతో ప్రపంచవ్యాప్తంగా నైతిక రాజకీయానికి మార్గదర్శిగా నిలిచాడాయన. దేశ స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు గడిచాక నేడు, గాంధీని హత్య చేసిన గాడ్సేను కీర్తిస్తూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలు భారతజాతి నైతికత మీద దాడి చేయడమే. అన్ని జాతులు, మతాలు కలగలిసి సమైక్యంగా జీవించాలనే ఆకాంక్ష కోసం ఆయన చెల్లించిన మూల్యం-- ప్రాణం. ప్రజాస్వామ్యంలో హింసను, హత్య చేసిన వారిని కీర్తించడం అంటే ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమే. దేశానికి గాంధీ లేకున్నా స్వాతంత్ర్యం వచ్చేదేమో కానీ, గాంధీ ఐడియాలజీ లేకుండా దేశం ఇంతటి ప్రశాంతతను పొందేది కాదు. మార్టిన్ లూథర్కింగ్ అమెరికాలో నల్ల జాతీయులకు హక్కులు సాధించినా, నెల్సన్ మండేలా దక్షిణాఫ్రికాకు స్వాతంత్ర్యం తెచ్చినా... మహాత్ముడి అహింసా మార్గమే వారికి ఆదర్శం. గాంధీ సత్యాగ్రహం అంటే-- తనను తాను ఆత్మపరిశీలన, ఆత్మ పరివర్తన చేసుకోవడం. మనిషిలో హింస, కోపం, అహంకారం, ద్వేషం ఉన్నప్పుడు ఇతరులకు మార్గదర్శిగా నిలవడం నైతికంగా సరైంది కాదని ఆయన నమ్మారు. ఇదే గాంధీ సత్యాగ్రహానికి పునాది. తనతో తాను నిజాయితీగా ఉండకపోతే, సత్యం కోసం సమాజంతో పోరాడే నైతిక హక్కు ఉండదని నమ్మారు. చౌరీ--చౌరా సంఘటనలో హింస జరిగిందని, తాను నైతికంగా సమాజాన్ని అహింస వైపు నడిపించడంలో విఫలమయ్యానని భావించి ఉద్యమాన్ని ఆపేశారు. ఇది గాంధీలోని ఆత్మపరిశీలనకు ఒక గొప్ప తార్కాణం. అలాగే గాంధీ దృష్టిలో ధర్మం అంటే-- సత్యం, అహింస, నైతికతపై ఆధారపడిన జీవన విధానం. ధర్మం-- వ్యక్తిగత, సామాజిక రాజకీయ రంగాలన్నిటిలోనూ నైతిక బాధ్యతను సూచిస్తుంది. వ్యక్తికీ-- వ్యక్తికీ, వ్యక్తికీ-- సమాజానికీ, సమూహానికీ-- సమూహానికీ మధ్య సంబంధాలను నిర్వచించే విలువగా ధర్మాన్ని ప్రస్తావించారు. గాంధీ దృష్టిలో సన్యాసి అంటే అంతర్ముఖ నైతికత, సామాజిక బాధ్యత, బాహ్యాజీవన రీతిగా ఆచరించేవారు; ముఖ్యంగా బలహీనుల పక్షాన నిలబడే ఆధునిక వేదాంతి; సమాజం నుంచి పారిపోయేవారు కాదు, ఒక నైతిక పోరాట యోధుడు. స్వదేశీ గురించి విస్తృతంగా ప్రచారం చేసిన గాంధీ... కేవలం దేశీయ వస్తువుల వాడకం, విదేశీ వస్తువుల బహిష్కరణ మాత్రమే కాదు. దానిని ఒక సామాజిక, ఆర్థిక కార్యక్రమంగా ముందుకు నడిపారు. ఖద్దరు ఉత్పత్తి, సత్యాగ్రహం, రైతు ఉద్యమాలు, దేవాలయ ప్రవేశాలు ఇవన్నీ కూడా ప్రజలను కుల, మత రహితంగా ఐక్యం చేయడానికి ఉద్దేశించిన కార్యాచరణలు. తోటి మానవుల పట్ల ప్రేమ, దయ, గుణాలతో వ్యవహరించడం, మానవసేవే మాధవ సేవగా ఆచరించడం... గాంధీ దృష్టిలో సనాతనం. గాంధీ సనాతనవాదం ఏ విషయాలపైనా మొండిగా వ్యవహరించదు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఆధ్యాత్మిక మార్గాన్ని చూపుతుంది. ''నా హిందూయిజం ఎవరినీ వెలివేయదు. అన్ని తరగతులను కలుపుకుపోయే సమగ్రతా సిద్ధాంతం" అంటారు గాంధీ. అస్పృశ్యతకు వ్యతిరేకంగా గాంధీ పెద్ద యుద్ధం చేశారు. హిందూ శాస్త్రాల భావం సమానత్వాన్ని ప్రసాదించేదే తప్ప అస్పృశ్యతను ప్రోది చేసేది కాదని పలు సందర్భాల్లో అన్నారు. 'హరిజన'



పేరుతో ఒక పత్రికను స్థాపించి, అహింసా సిద్ధాంతానికి అస్పృశ్యత విరుద్ధమని చాటారు. సాటి మనిషిని తక్కువగా, అవమానకరంగా చూడడం భగవద్గీత సందేశానికి కూడా వ్యతిరేకమని హిందూ సమాజాన్ని హెచ్చరించారు. హిందూ మతంలో అంతర్గత సంస్కరణల కోసం పోరాటం చేసిన చిట్టచివరి నాయకుడు మహాత్మాగాంధీ. సత్యమే దేవుడని నమ్మిన ఆయన దైవాన్వేషణలో ఎవ్వరూ మతం మారాల్సిన అవసరం లేదని చెప్పారు. గాంధీ లేకుండా స్వాతంత్ర్యోద్యమాన్ని, అంబేద్కర్ లేకుండా భారత రాజ్యాంగాన్ని, నెహ్రూ లేకుండా ఆధునిక భారతాన్ని ఊహించలేం. వీరి ఆలోచనలు, ఆచరణ భారతీయ మూలాల నుంచి ఉద్భవించాయి. ఇటీవల మహాత్ముడిని తక్కువ చేస్తూ వస్తున్న పెడధోరణులు గాంధీ వ్యక్తిత్వ హననానికి చేస్తున్న ప్రయత్నాలు. పౌర సమాజం ఈ పోకడలను గుర్తించి, ప్రజలను వాస్తవికత వైపు నడిపించాల్సిన ఆవశ్యకత ఉంది.

# ఇరాన్పై ట్రంప్ దూకుడు



ఇరాన్ పాలకులను అమెరికా అధ్యక్షుడు తీవ్రంగా హెచ్చరిస్తున్నాడు. కనీవినీ ఎరుగనంతగా విరుచుకుపడతానని బెదిరిస్తున్నాడు. ట్రంప్ మాటమీద నమ్మకం లేకనో, తనమీద తనకు శ్రుతిమించిన నమ్మకంవల్లనో ఇరాన్ ఎప్పటిలాగానే మాటకుమాట బదులిస్తోంది. ఈ అదిలింపులూ బెదిరింపులకు జడిసేది లేదని, ట్రిగ్గర్ బిగించి సర్వసన్నద్ధంగా ఉన్నామని ట్రంప్ను తీసిపారేస్తోంది. ఇరాన్ సీనియర్ నాయకులు లక్ష్యంగా ఈ మారు దాడులు జరిగి, ఈ ముట్టడితో కచ్చితంగా ట్రంప్ ఆశిస్తున్న నాయకత్వం మార్పు సాధ్యపడుతుందని పాశ్చాత్య మీడియా సంస్థల నమ్మకం. ఒకదశలో కాస్తంత తగ్గుముఖం పట్టినట్టుగా కనిపించిన ఖమేనీ వ్యతిరేక ఉద్యమం, తిరిగి తారస్థాయికి చేరడంతో ఇంతకుమించిన మంచిసమయం మళ్ళీ రాదని అమెరికా నమ్ముతోందట. సదరు అంతర్గత సంక్షోభాన్ని వాడుకొని అక్కడ అస్మదీయులను ప్రతిష్ఠించాలన్నది ట్రంప్ కోరిక. గత ఏడాది ఇరాన్ అణుకేంద్రాలమీద తాము దాడులు చేసిన సంగతినీ, వందలాదిమందిని మట్టుబెట్టి రాత్రికి రాత్రి వెనెజువెలా అధ్యక్షుడిని తరలించిన ఇటీవలి దృశ్యాన్ని పదేపదే గుర్తుచేస్తూ, అంతకంటే ఘాటుగా, గట్టిగా దెబ్బకొడతాను జాగ్రత్త అని ఇరాన్ పాలకులను ట్రంప్ హెచ్చరిస్తున్నారు. దాడులకు పాల్పడేముందు చర్చలకు రమ్మని ఇరాన్ను సాదరంగా ఆహ్వానిస్తున్నారు. అణ్వస్త్రాలకు చోటులేని, సమన్యాయబద్ధమైన ఒప్పందం కుదరాలని అంటూనే, ఆ చర్చలు జరగాలంటే ఇరాన్ ముందుగా సంపూర్ణంగా అస్త్రసన్యాసం చేయాలట. యురేనియం శుద్ధిని పూర్తిగా నిలిపివేయడం, ఖండాంతర క్షిపణుల తయారీపై అమెరికా కొత్త నిబంధనలకు తలొగ్గడం, పశ్చిమాసియాలో ఇరాన్ అనుకూల గ్రూపులకు సహాయసహకారాలు పూర్తిగా నిలిపివేయడం ఈ ఆంక్షల్లో కొన్ని. గత ఏడాది జూన్లో జరిగిన కొద్దిరోజుల యుద్ధంలో ఇరాన్ వందలాది క్షిపణులను ఇజ్రాయెల్మీదకు ప్రయోగించిన సంగతి తెలిసిందే. వాటివల్ల ప్రాణనష్టం పెద్దగా లేకున్నా, వాటిని నిలువరించి, నిరోధించి తనను తాను రక్షించుకొనే క్రమంలో ఇజ్రాయెల్ తన ఆయుధ సంపత్తిని ఎక్కువగా నష్టపోయిందట. ఇజ్రాయెల్ దగ్గరున్న క్షిపణి నిరోధక వ్యవస్థల బలహీనతలు, వైఫల్యాలను కూడా ఆ దాడులు మిగతా ప్రపంచానికి ఎత్తిచూపాయి.

ఈ నేపథ్యంలో, శత్రువుచేతుల్లో ఇజ్రాయెల్ను చేరగలిగే ఆయుధాలే లేకుండా చేయాలని ప్రయత్నం. ఇరాన్ చుట్టూ భారీ యుద్ధనౌకలను మోహరించి?న ట్రంప్ అతివేగంగా లక్ష్యాన్ని సాధించాలని అనుకుంటున్నారనీ, దీర్ఘకాలం యుద్ధం కాక, ఓ పెద్ద దెబ్బతో శత్రువును కూల్చి నాయకత్వమార్పిడి కలను నెరవేర్చుకోవాలని అనుకుంటున్నట్టు మీడియా విశ్లేషిస్తోంది. ఇరాన్తో వ్యవహారం ట్రంప్ మాటల్లాగా తేలిక కాదని అమెరికా సైనికాధిపతులకు తెలుసు. పాతకాలపు రష్యన్ ఆయుధాలను వాడే వెనెజువెలామీద క్షణాల్లో విజయం సాధించినట్టుగా ఇరాన్ను కూడా నిముషాల్లో నిర్వీర్యం చేయగలనని ట్రంప్ నమ్ముతున్నట్టుంది. ఇరాన్ స్వదేశీ, విదేశీ ఆయుధసంపత్తి గురించి బయటకు తెలిసింది తక్కువేననీ, యుద్ధం మొదలైతేగానీ చైనా అందించిన అధునాతన ఆయుధాలు బయటపడవని రక్షణరంగ నిపుణులు అంటున్నారు. తన అణుకార్యక్రమం శాంతియుతమైనదని ఇరాన్ అనడం, అణ్వాయుధాలు తయారుచేస్తోందంటూ అమెరికా పాతపాటే పాడటం అనాదిగా సాగుతోంది. 2015లో అమెరికా చొరవతో జరిగిన అణుఒప్పందం మిగతా ప్రపంచానికి యుద్ధ భయాన్ని పోగొట్టింది.

ఆ తరువాత ఇరాన్ యురేనియం శుద్ధిస్థాయి హద్దులు దాటినట్టుగా ఆధారాలు కూడా లేవు. అయినా, మూడేళ్ళలోనే ట్రంప్ ఆ ఒప్పందం నుంచి వైదొలిగి, ఇరాన్మీద మళ్ళీ ఆంక్షలతో పరిస్థితిని మొదటికి తెచ్చారు. ఆర్థికకష్టాల్లో మునిగిన ఇరాన్ కూడా పరిమితులను ఉల్లంఘించాల్సిన పరిస్థితి కల్పించారు. పశ్చిమాసియాకు యుద్ధవిమానాలు, నౌకలు తరలిస్తున్న ట్రంప్కు అనేకదేశాలు చెబుతున్న హితవు చెవికెక్కడం లేదు. అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం అన్నివేలమందిని ఊచకోతకోసిన ఇరాన్ పాలకులు అంతసులువుగా విదేశీశక్తులకు లొంగిపోతారనుకోవడం భ్రమ. తమకు అనుకూలంగా లేని పాలకులను అమెరికా గద్దె దించేసిన దేశాలన్నీ ఆ తరువాత యుద్ధాలు, అంతర్యుద్ధాలు, జాతులూ తెగల వైరాలతో కుప్పకూలి, ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టేసిన గతం ట్రంప్కు తెలియందేమీ కాదు.